క్లుప్తంగా

ఏపీ అడిషనల్ డీజీపీకి స్వాగతం



అడిషనల్ డీజీపీని సన్మానిస్తున్న రోశిరెడ్డి

భద్రాచలం: ములుగు జిల్లా మేడారంలో సమ్మక్క–సారలమ్మ జాతరకు వెళ్తున్న ఆంధ్రప్రదేశ్ అడిషనల్ డీజీపీ మీనా శుక్రవారం సారపాకలోకి ఐటీసీ అతిథిగృహంలో కాసేపు ఆగారు. ఈ సందర్భంగా ఆయనకు రామాలయ మాజీ ట్రస్ట్ బోర్డు సభ్యుడు ఎడమకంటి రోశిరెడ్డి స్వాగతం పలికి శ్రీసీతారామచంద్రస్వామి ప్రసాదం అందచేశారు.

పరామర్శ..



పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే మెచ్చా

అశ్వారావుపేటరూరల్: మండలంలోని మద్దికొండ గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ కాసాని వెంకటేశ్వరరావును మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు శుక్రవారం పరామర్శించారు. అనారోగ్యం కారణంగా ఇంటి వద్దే ఉంటున్న మాజీ ఎంపీపీ నివాసానికి వెళ్లి ఆయన ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకున్నారు.

సేవాదళ్ మండల అధ్యక్షుడిగా శ్రీనివాసరావు



చండ్రుగొండ : కాంగ్రెస్ అనుబంధ సేవాదళ్ మండలాధ్యక్షుడిగా బుంగా శ్రీనివాసరావు నియమితులయ్యారు. ఈ మేరకు సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి కొదుమూరి దయాకర్‌రావు, జిల్లా అధ్యక్షుడు కేశబోయిన నర్సింహారావులు నియామకపు లేఖను శుక్రవారం శ్రీనివాసరావుకు అందించారు. అనంతరం శ్రీనివాసరావును ఘనంగా సన్మానించారు. అదేవిధంగా ఇటీవల నియోజకవర్గ కార్యదర్శిగా నియమితుడైన బెండాలపాడుకు చెందిన ఫజల్‌బక్ష్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సారేపల్లి శేఖర్, కృష్ణారెడ్డి, నల్లమోతు రమణ, అంతటి రామకృష్ణ, బొర్రా సురేష్, దారం గోవిందరెడ్డి, మనోహర్, బడుగు కృష్ణవేణి, రుక్మిణి తదితరులు పాల్గొన్నారు.

గురుకులంలో వ్యక్తిత్వ వికాస తరగతులు

ములకలపల్లి : మండలకేంద్రంలోని గురుకుల పాఠశాలలో లయన్స్ క్లబ్ ఆఫ్ పాల్వంచ, కిన్నెరసాని ఆధ్వర్యంలో శుక్రవారం వ్యక్తిత్వ వికాస తరగతులు నిర్వహించారు. ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు డాక్టర్ గాజర్ల వీరభద్రం గురూజీ పాల్గొని మాట్లాడారు. ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ జ్యోతి, క్లబ్ సెక్రటరీ రేపాక ప్రసాదరావు, సభ్యుడు పద్దం నర్సింహారావు, లెక్చరర్ చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే లాస్య నందిత మృతి బాధాకరం

అశ్వారావుపేటరూరల్: రోడ్డు ప్రమాదంలో ఎమ్మెల్యే లాస్య నందిత అకాల మృతి బాధాకరమని ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామ్మూర్తి అన్నారు. శుక్రవారం ఆయన స్థానిక బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి మాట్లాడుతూ.. చిన్న వయస్సులోనే ఎమ్మెల్యేగా ప్రజల మన్ననలు పొందిన యువ ఎమ్మెల్యే ప్రమాదంలో మృతి చెందడం పార్టీకు తీరని లోటన్నారు. ఆమె మృతి పట్ల కుటుంబీకులకు ప్రగాఢ సానుభూతి తెలిపి, సంతాపం వ్యక్తం ప్రకటించారు. ఈ సమావేశంలో బీఆర్‌ఎస్ నాయకులు మందపాటి మోహన్‌రెడ్డి, యూఎస్ ప్రకాశ్‌రావు, సత్యవరపు సంపూర్ణ, వెంకన్న ఉన్నారు.

కాలినడకన ద్వారకా తిరుమలకు..



ద్వారకా తిరుమలకు వెళ్తున్న భక్త బృందం

అశ్వారావుపేటరూరల్: మండల కేంద్రంలోని చిన్నంశెట్టిబజార్‌కు చెందిన పలువురు భక్తులు శుక్రవారం ఏపీలోని ఏలూరు జిల్లాలోని ద్వారకా తిరుమలకు పాదయాత్రగా తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఏపీలోని జంగారెడ్డిగూడెం సమీపంలో గల శ్రీమద్ది ఆంజనేయస్వామి ఆలయానికి చేరుకొని స్వామి వారిని దర్శించుకుని ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ద్వారకా తిరుమలకు బయలుదేరారు.

వనదేవతలకు మొక్కులు..

- పతాక స్థాయికి చేరిన జాతర
- దుకాణాల వద్ద కొనుగోలుదారుల రద్దీ
- భక్తులకు అన్నదానం.. ఉచిత మజ్జిగ పంపిణీ



తోగ్గూడెంలో గద్దెల వద్ద మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

మణుగూరు రూరల్: మండల పరిధిలోని తోగ్గూడెం శ్రీసమ్మక్క–సారలమ్మ దేవాలయం(మినీమేడారం)లో నిండు జాతర కనులపండువగా జరిగింది. గద్దెలపై వనదేవతలు సమ్మక్క–సారలమ్మలు కొలువుదీరడంతో గురువారం రాత్రి నుండి జాతర ప్రారంభమైంది. పినపాక నియోజకవర్గంలోని మండలాల ప్రజలతో పాటు ఇతర ప్రాంతాల నుండి తోగ్గూడెం మీదుగా వెళ్లే వారు సైతం మినీ మేడారంలో వనదేవతలను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. మరికొంతమంది భక్తులు అమ్మవార్లకు బంగారం నైవేద్యంగా సమర్పించి తమ కుటుంబాలను చల్లగా చూడాలని మొక్కులు చెల్లించుకున్నారు. ఇంకొంతమంది భక్తులు ఆలయ ప్రాంగణంలోని అటవీ ప్రాంతంలో బస ఏర్పాటు చేసుకుని వంటలు వండి సహపంక్తి భోజనాలు చేసి సంతోషంగా గడిపారు. భక్తులు, చిన్నారులు ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన దుకాణాల్లో బొమ్మలు, దేవుళ్ల చిత్రపటాలు వంటి కొనుగోలుదారులతో రద్దీగా దర్శనమిచ్చింది. అలాగే ఆలయ వెనుక భాగంగా ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌లో చిన్నారులు, యువత సందడి చేశారు. నిండుజాతరకు భక్తులు అధికసంఖ్యలో తరలిరావడంతో ఆలయ ప్రాంగణం కళకళలాడిపోయింది.

భక్తులకు అన్నదానం..

తోగ్గూడెం శ్రీసమ్మక్క–సారలమ్మ దేవాలయంలో మినీ మేడారం జాతరకు విచ్చేసే భక్తులకు వాసవీ క్లబ్, వాసవితా వైభవ్ క్లబ్, ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమాన్ని మూడో రోజు కూడా దిగ్విజయంగా కొనసాగింది. అయ్యప్ప దీక్ష ప్రచార సమితి వారి ఆధ్వర్యంలో భక్తుల కోసం ఏర్పాటు చేసిన ఉచిత మజ్జిగ పంపిణీ కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. ఈ కార్యక్రమాల్లో వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ దోసపాటి వెంకటేశ్వరరావు, ఇంటర్నేషనల్ ప్రోగ్రాం కో ఆర్డినేటర్ బండారు నరసింహారావు, ఎస్‌కెటి గ్రూప్స్ డైరెక్టర్ దోసపాటి నాగేశ్వరరావు, దోసపాటి పిచ్చేశ్వరరావు, క్లబ్ అధ్యక్షులు కె.రాజేంద్రప్రసాద్, శ్యామ్, సీహెచ్.నాగరాజు, వనిత క్లబ్ సభ్యులు బి.అంజలి, టి.వసుధ, వసుంధర, శేషుబాబు, సీహెచ్ రమేష్‌బాబు, కె.రాము, ఉమ, నాగరత్నమణి, ప్రభాకర్, ఆర్యవైశ్య సంఘ సభ్యులు, అయ్యప్ప దీక్ష ప్రచార సమితి సభ్యులు తనుగుల శ్రీను, సింహాద్రి కిరణ్, భక్తులు పాల్గొన్నారు

జనసంద్రంగా ఎదిరగుట్టలు



ఊరేగింపు కార్యక్రమంలో భక్తులు



అమ్మవార్లను దర్శించుకుంటున్న భక్తులు

చర్ల: మండలంలోని సుబ్బంపేట గ్రామ పంచాయతీ పరిదిలోగల ఎదిరగుట్టల వద్ద గల సమ్మక్క సారలమ్మల దేవాలయం వద్ద సుంకు జాతర వైభవంగా సాగుతోంది. అమ్మవార్ల సుంకు జాతరలో భాగంగా రెండో రోజు కూడా భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవార్లను దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. భారీగా భక్తులు తరలిరావడంతో ఎదిరగుట్టల ప్రాంతం భక్తులతో కిటకిటలాడింది. ఎప్పుడూ నిర్మానుష్యంగా ఉండే సమ్మక్క సారలమ్మల దేవాలయం జనంతో కళకళలాడుతోంది. చర్ల, దుమ్ముగూడెం, వెంకటాపురం, వాజేడు మండలాలతో పాటు సమీపంలో ఉన్న చత్తీస్‌గడ్ రాష్ట్రంలోని బీజాపూర్, సుకుమా జిల్లాల నుంచి కూడా భక్తులు బారీగా తరలి వచ్చారు.

ఏఈసీఎస్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం

అశ్వాపురం: మండల కేంద్రంలోని గౌతమీనగర్ కాలనీలోని అణుశక్తి కేంద్రీయ విద్యాలయంలో 2024–25 విద్యా సంవత్సరానికి 1 నుంచి 8 వ తరగతి వరకు ఉచిత విద్య ప్రవేశాలకు మార్చి 2 నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నట్టు ప్రిన్సిపాల్ రాజశేఖర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి 1 నుండి 11 వరకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 వరకు దరఖాస్తులు ఇవ్వనున్నట్టు పేర్కొన్నారు. మార్చి 2 నుండి 12 వరకు ఉదయం 9 నుండి మధ్యాహ్నం 1 వరకు దరఖాస్తులు స్వీకరిస్తారని తెలిపారు. 1 వ తరగతిలో ప్రవేశాలకు 31-03-2024 వరకు 6 సంవత్సరాలు నిండి ఉండాలని, భారజల కర్మాగారం కాలనీ పరిసర ప్రాంతాలలో సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు చెందిన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఈనెల 29న వేంకటేశ్వర కల్యాణం

అశ్వాపురం: మండల పరిధిలోని నెల్లిపాక బంజర గ్రామంలోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 29న స్వయంభూ శ్రీదేవి భూదేవి సమేత శ్రీ అభినవ వెంకటేశ్వరస్వామి వారి 20వ వార్షిక తిరుకల్యాణ మహోత్సవం నిర్వహిస్తున్నట్టు ఆలయ కమిటీ నిర్వాహకులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 27, 28న అభిషేకాలు, ప్రత్యేక పూజలు, 29న కల్యాణ మహోత్సవం, కల్యాణం అనంతరం మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు.

నియోజకవర్గ ప్రగతికి శ్రీకారం..

- ఎమ్మెల్యే జారే ఆదినారాయణ



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదినారాయణ, పక్కన నాయకులు

దమ్మపేట : కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన 60 రోజుల్లోనే నియోజకవర్గ ప్రగతికి శ్రీకారం చుట్టానని స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అభిప్రాయం వ్యక్తం చేశారు. శుక్రవారం మండలంలోని గండుగులపల్లి క్యాంపు కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ... దమ్మపేట మండల కేంద్రంలో అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని అన్నారు. కోర్టు ఏర్పాటుకు సహకరించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావులకు ధన్యవాదాలు తెలిపారు. నియోజకవర్గం వ్యాప్తంగా రూ.8.5 కోట్ల వ్యయంతో సీసీ రోడ్ల నిర్మాణానికి ఎన్‌ఆర్‌ఈజీఎస్ నుండి నిధులను మంజూరు చేయించానన్నారు. 13.5 కోట్ల రూపాయల ఎస్డీఎఫ్ నిధులు మంజూరు కాగా వాటిలో 10 కోట్ల రూపాయలను సీసీ రోడ్లు, డ్రెయినేజీ నిర్మాణాలకు, రూ.2 కోట్లు ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి, 50 లక్షల రూపాయలను ప్రభుత్వ కార్యాలయాల మెయింటెనెన్స్‌కు వినియోగించనున్నామన్నారు. మిచాంగ్ తుఫాన్ కారణంగా దెబ్బతిన్న బీటీ రోడ్ల మరమ్మతులకు రూ.1.13 కోట్లు, అశ్వారావుపేటలో ప్రభుత్వ మార్చురీ నిర్మాణానికి కూడా నిధులు మంజూరయ్యాయన్నారు. నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలసిన మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్

అశ్వారావుపేట రవాణా శాఖ కార్యాలయంలో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ సంగం వెంకటపుల్లయ్య ఎమ్మెల్యే జారే ఆదినారాయణను కలిశారు. మండలంలోని గండుగులపల్లి క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను కలసి ఆయనకు మామిడి మొక్కను అందజేశారు. ఎమ్మెల్యే అభినందనలు తెలుపుతూ, విధులను చిత్తశుద్ధితో నిర్వర్తించాలని సూచించారు.

అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు



మాట్లాడుతున్న తహసీల్దార్ ముజాహిద్

బూర్గంపాడు: మండలంలో ఇసుక, మట్టి అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ ఎండి.ముజాహిద్ హెచ్చరించారు. శుక్రవారం తహసీల్దార్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఇసుక, మట్టి అనుమతులు లేకుండా అక్రమ రవాణా చేస్తే వాహనాలను, ఇసుక స్టాక్ పాయింట్లను పరిశీలించి వాటినీ సీజ్ చేసి కేసులు నమోదు చేస్తామన్నారు. అనధికారిక ఇసుక ర్యాంపులు నడవకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపడతామన్నారు. అక్రమ రవాణాకు పాల్పడేవారు ఎంతటివారైనా ఉపేక్షించేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పీఆర్‌సీని త్వరగా అమలు చేయాలి



రఘురాంను సన్మానిస్తున్న పెన్షనర్లు

చండ్రుగొండ : రిటైర్డ్ ఉద్యోగులకు పీఆర్‌సీని అమలు చేయాలని పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు ఈజీఆర్ వెస్లీ ప్రభుత్వాన్ని కోరారు. మండలకేంద్రం చండ్రుగొండలో శుక్రవారం పెన్షనర్ల డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డీఏతో పాటు ప్రతీ నెల 1న పెన్షన్ ఇవ్వాలని కోరారు. అనంతరం ఎస్‌బీఐ మేనేజర్ జి.రఘురాం, ప్రభుత్వ వైద్యాధికారి వెంకటప్రకాష్, సీనియర్ పెన్షనర్లు మురళీప్రసాద్, లక్ష్మి, ఆర్.కోటేశ్వరమ్మ, ఎస్.అచ్యుతరావులను సన్మానించారు. యూనిట్ అధ్యక్షుడు కాళ్లూరి సుధాకర్‌రావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వెంకటేశ్వరరావు, మోహన్‌రావు, నారాయణరావు పాల్గొన్నారు.

మొక్కుబడిగా 'ఉపాధి' గ్రామసభ



గ్రామసభను వాయిదా వేయాలని డిమాండ్ చేస్తున్న సీపీఎం నాయకులు

బూర్గంపాడు: సారపాక గ్రామపంచాయతీ ఆవరణలో శుక్రవారం నిర్వహించిన ఉపాధిహామీ పనుల సామాజిక తనిఖీ గ్రామసభ మొక్కుబడిగా సాగింది. గ్రామంలో 1,800మంది ఉపాధిహామీ కూలీలున్న పట్టుమని పదిమంది కూడా సామాజిక తనిఖీ గ్రామసభకు హాజరు కాలేదు. ఉపాధిహామీ సామాజిక తనిఖీ బృందం తమ నివేదికలను చదివి వినిపించి గ్రామసభను ముగించారు. ఉపాధి హామీ పనులు చేసిన కూలీలకు ఏళ్ల తరబడి వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని, ఉపాధి పనుల నిర్వహణలో జరిగిన అవకతవకలపై నిగ్గు తేల్చాలేదని సీపీఎం మండల కార్యదర్శి బత్తుల వెంకటేశ్వర్లు ఆరోపించారు.

స్వచ్ఛభారత్‌పై అవగాహన ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

అశ్వాపురం: మండల కేంద్రంలోని గౌతమీనగర్ కాలనీలో అణుశక్తి కేంద్రీయ విద్యాలయం విద్యార్థులు స్వచ్ఛభారత్‌పై ర్యాలీ నిర్వహించారు. ప్లాస్టిక్ నిషేధం, పరిసరాల పరిశుభ్రత, స్వచ్ఛభారత్‌పై ప్రజలకు అవగాహన కల్పిస్తూ విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఈసీఎస్ ప్రిన్సిపల్ రాజశేఖర్, వైస్ ప్రిన్సిపల్ ఆర్‌కే.రావు, ఉపాధ్యాయుడు రఘునాథరావు, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు అభినందన



విద్యార్థినులను అభినందిస్తున్న మహ్మద్ పాషా

అన్నపురెడ్డిపల్లి : మండలకేంద్రం అన్నపురెడ్డిపల్లిలోని కేజీబీవీ విద్యార్థినులను కొత్తగూడెంకు చెందిన వీ కేర్ మల్టీస్పెషాలిటీ హాస్పిటల్ చైర్మన్ డాక్టర్ మహ్మద్ పాషా శుక్రవారం అభినందించారు. ఈ నెల 19న ఖమ్మంలో నిర్వహించిన ఇంగ్లీష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్(ఎల్టా) ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాస్థాయి డ్రామా పోటీల్లో కేజీబీవీ విద్యార్థినులు ప్రతిభ కనబరిచి ఈ నెల 26 నుంచి హైదరాబాద్‌లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా నుంచి ప్రతినిధ్యం వహించనున్నారు. ఈ క్రమంలో విద్యార్థినులతోపాటు ప్రిన్స్‌పాల్ కవిత, గైడ్‌టీచర్ అరుణను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎల్టా జిల్లా ప్రెసిడెంట్ ఎస్కే దస్తగీర్, వైస్ ప్రెసిడెంట్ జహంగీర్ షరీఫ్, వీకేర్ డైరెక్టర్ రహీం పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ స్వాధీనం

దుమ్ముగూడెం: మండలంలోని చిన్ననల్లబల్లి నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై గణేష్ ఆధ్వర్యాన గురువారం రాత్రి చిన్ననల్లబల్లి దగ్గర వాహన తనిఖీలు చేపట్టగా చర్ల మండలం కుదునూరు నుంచి ఇసుకతో వస్తున్న ట్రాక్టర్‌కు అనుమతి లేదని గుర్తించారు. దీంతో ట్రాక్టర్‌ను స్టేషన్‌కు తరలించారు.

సంత్ సేవాలాల్ జయంతి

బూర్గంపాడు: సారపాకలోని గాంధీనగర్‌లో శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సేవాలాల్ చిత్రపటానికి పూలమాలలు వేసి భోగ్–భండారో కార్యక్రమం నిర్వహించారు. జెడ్పీటీసీ కామిరెడ్డి శ్రీలత మాట్లాడుతూ.. సేవాలాల్ ఆశయాలను కొనసాగిస్తు ఆయన చూపిన సన్మార్గంలో ప్రగతిపథంలో నడవాలన్నారు. ఈ కార్యక్రమంలో సేవాలాల్ సేన రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు బానోత్ హుస్సేన్‌నాయక్, ఐటీసీ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పాకాల దుర్గాప్రసాద్, టీఎస్‌టీయూసీ అధ్యక్షుడు కనకమేడల హరిప్రసాద్, బత్తుల వెంకటేశ్వర్లు, గోపిరెడ్డి రమణారెడ్డి, జలగం జగదీష్, సానికొమ్ము శంకర్‌రెడ్డి, దుగ్గెంపూడి కృష్ణారెడ్డి, ముచ్చ వెంకటేశ్వరరావు, పేరాల శ్రీనివాస్, కిషన్‌నాయక్, భాస్‌సింగ్ నాయక్, అజ్మీరా రాంజీ, భీమ్లా నాయక్ పాల్గొన్నారు.

దిష్టిబొమ్మ దహనం



దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

ములకలపల్లి: ఢిల్లీలో రైతులపై జరిపిన పోలీస్ కాల్పులను ఖండించాలని తెలంగాణా రైతు సంఘం మండల కార్యదర్శి ఊకంటి రవికుమార్ పిలుపునిచ్చారు. కాల్పులను నిరసిస్తూ మండలకేంద్రంలో సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. గోపగాని లక్ష్మీనర్సు, సీఐటీయూ మండల కన్వీనర్ నిమ్మల మధు, బేతి అమల, రమేశ్, బూరం నాగబాబు, మోడె వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ వార్షికోత్సవ వేడుకలు



సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న భక్తులు

మణుగూరు టౌన్: మండలంలోని సాయినగర్‌లోని సాయి బాబా ఆలయ 30వ వార్షికోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెల్లవారుజామున కాగడ హారతి, సామూహిక సాయి చాలీసా పారాయణం, నుంచి రాత్రి 8.30 వరకు పవళింపు సేవ కార్యక్రమాలు అంగరంగ వైభవంగా జరిగాయి. భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సామూహిక సహాయక అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మళ్లీ గుప్పుమంటోంది..!

గ్రామాల్లో విచ్చలవిడిగా గుడుంబా విక్రయాలు

- తయారీ కేంద్రాలపై మొక్కుబడిగా దాడులు
- చోద్యం చూస్తున్న అధికారులు



ఓ ఇంట్లో బాటిల్‌లో తెచ్చుకున్న సారా



గుడుంబా తయారీకి వినియోగించే బిందె

కరకగూడెం: పల్లెల్లో మళ్లీ గుడుంబా గుప్పుమంటోంది. కొన్నేళ్లుగా స్తబ్దుగా ఉన్న నాటుసారా తయారీ మళ్లీ పుంజుకుంటోంది. గుడుంబాతయారీదారులు గుట్టుచప్పుడు కాకుండా తయారు చేసి రహస్యంగా ఇతర ప్రాంతాలకు తరలిస్తూ దందా సాగిస్తున్నారు. మద్యం దుకాణాల్లో మద్యం ధరలు పెరగడంతో పేద, మధ్య తరగతి ప్రజలు నాటుసారా వైపు మళ్లుతున్నారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆదాయం పొందవచ్చుననే దురాలోచనతో కొందరు అక్రమార్కులు సారా కాస్తున్నారు. పల్లెల్లోని శివారు ప్రాంతాలను ఎంపిక చేసుకుని బట్టీలు ఏర్పాటు చేసుకుని ముందుగా బెల్లం ఊటను సిద్ధం చేసుకుంటూ నాటుసారా వ్యవహారం మరోసారి తెర పైకి తెచ్చారు. మరోపక్క అధికార యంత్రాంగం దాడులు మొక్కుబడిగా సాగుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అడపా దడపా చేస్తున్న దాడుల్లో కేవలం బెల్లం ఊటలే పట్టుబడుతుండడం గమనార్హం. పూర్తిస్థాయిలో నిఘా పెట్టడం ద్వారా నిషేధిత సారా రాక్షసికి అడ్డుకట్ట వేయగలం.

చితికిపోతున్న కుటుంబాలు..

సారాకు బానిసలై పలువురు అనారోగ్యం బారిన పడుతున్నారు. కొన్నేళ్ల నుంచి అధికారులు పట్టించుకోకపోవడంతో సారా తయారీ బాగా పెరిగిపోయింది. పోలీసులు, ఆబ్కారీశాఖ అధికారులు అప్పుడప్పుడు కేసులు నమోదు చేస్తున్నాతయారీ ఆగడంలేదు. అరెస్టు అయి వచ్చిన వారు యథావిధిగా కొనసాగిస్తున్నారు. అధికారులు దృష్టి సారించి సారా నియంత్రణకు చర్యలు చేపట్టాలని పలువురు మహిళలు కోరుతున్నారు. మండల పరిధిలోని కలవలనాగరం గ్రామం కేంద్రంగా నాటు సారా తయారీ అయ్యి అక్కడ నుంచి మారుమూల ప్రాంతాలకు గుట్టు చప్పుడు కాకుండా సరఫరా చేస్తూ యువతను సైతం మత్తులో ముంచుతున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. చిన్నచిన్న కిరాణ దుకాణాల్లో సారాను ప్యాకెట్ల రూపంలో విక్రయిస్తూ దందాను సాగిస్తున్నారు.

గుడుంబా తయారీపై ఉక్కుపాదం మోపుతాం..

సారా తయారీని ఉపేక్షించేది లేదు. బదిలీల్లో భాగంగా రెండు క్రితమే వచ్చాను. ఆకస్మిక దాడులు చేసి గుడుంబా స్థావరాలపై ఉక్కుపాదం మోపుతాం. అంతేకాకుండా గుడుంబాను అరికట్టడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటాం.

– కిషోర్‌బాబు, మణుగూరు ఎక్సైజ్ ఎస్సై